# ఓడలూ-బళ్లూ

రావి-ఎన్-అవధాని




"బుగతగోరండీ! తవరి కోసం రవనయ్య పంతులుగారొచ్చారండి!" అన్నాడు పాలేరు రంగన్న.

"ఏరీ? రమ్మను!" అన్నారు రామనాథంగారు.

"కసేరీ సావిడిల కూకున్నారండి! ఆరెనక ఓ పట్నం బాబూ, ఆడమడిసీ ఉన్నారండి ఆరేమో పడవంత సిన్నకారు బండి తోలుకొచ్చినారు!" అన్నాడు.

"పట్నంబాబు ఎవరబ్బా! పద చూద్దాం!" అంటూ కచేరీ సావిడిలోకి వచ్చారు రామనాథంగారు.

"నమస్కారం బావగారూ! వీరు డాక్టరు శివరాంగారు. ఆవిడ వీరి అక్కగారు డాక్టరు జానకిగారు" అంటూ వారిని పరిచయం చేశారు రమణయ్యగారు.

వారిరువురూ ఆయనకు నమస్కరించి దీవెనలు అందుకున్నారు.

"ఏమిటి రమణయ్యా! వారం రోజులుగా కనిపించలేదు"

"అదే చెప్పాలని! పని పడి పట్నం తిరుగుతున్నా! మన గ్రామంలో జాతీయ రహదారిని అనుకుని నాకున్న 20 ఎకరాల మెట్టపొలం వీరు కొనుక్కున్నారు. అందులో వీరు అధునాతన సౌకర్యాలతో హాస్పిటల్, నర్సింగ్‌హోమ్ నిర్మిస్తారుట! అన్నాడు.

"చాలా సంతోషం బాబూ! మంచి వార్త విన్నాను. నా జీవితంలో నేను నెరవేర్చని పని అదొక్కటే! నా హయాంలో ఈ గ్రామంలో అందరికీ పక్కా ఇళ్లూ సిమ్మెంటు రోడ్లూ, మురుగునీటి కాలువలూ, రక్షిత మంచినీరు సమకూర్చాను. హైస్కూలు, పోస్టాఫీసు, బ్యాంకు, పోలీసు స్టేషన్, మండలి కార్యాలయం వగైరాలు తీసుకొని రాగలిగాను. అయితే పరిస్థితులు అనుకూలించక ప్రజలకు వైద్యం కొరకు ఏమీ చేయలేకపోయాను. అదే తీరని లోటు. దానిని మీరు తీరుస్తున్నారు! పరమానందంగా ఉంది బాబూ! చెప్పండి! నా సహాయం ఏం కావల్సినా మొహమాట పడకండి!" అన్నారు.

"మరేం లేదు బావగారూ! వీరు రెండు మూడు రోజుల్లో భూమి పూజ చేసి హాస్పటల్, నర్సింగ్‌హోమ్, డాక్టర్ల వైద్య సిబ్బంది ఇళ్ల నిర్మాణ పనులు మొదలుపెడతారుట. ఆ పనులన్నీ వారు దగ్గరుండి చూసుకోవాలనుకుంటున్నారు. పట్నం నుండీ రానూపోనూ 80 మైళ్ల ప్రయాణం కష్టం. అందుకని వారు ఇక్కడే ఉండాలనుకుంటున్నారు. మీ మేడ మీద నాలుగు గదులూ అన్ని సౌకర్యాలూ ఉన్నవి ఖాళీగా ఉన్నాయి కదా! వాటిని మీరు వీరికి కొద్దిరోజులు అద్దెకు ఇస్తారేమోనని..."

"తప్పకుండా! వారిష్టమొచ్చినంత కాలం ఉండొచ్చు! ముందు వీరిని తీసుకొని వెళ్లి చూపించు" అన్నారు

వారు చూసి వచ్చి నచ్చిన విషయం చెప్పారు.

"వీరి విషయం మీ అక్కకు ఓ మారు చెప్పాలి"

"తప్పకుండా! మేమూ వారిని రిక్వెస్ట్ చేస్తాం!" అంది డా.జానకి.

"సరే కానీ ఆవిడ గత ఆరు మాసాల నుండీ మోకాళ్ల ముణుకులు నొప్పితో బాధపడుతోంది. ఇప్పుడు మూడు రోజులై మంచం దిగడం కూడా కష్టంగా ఉంది. మీరే ఆవిడ గదికి రావాలి!" అని వారిని భార్య గదివద్దకు తీసుకొని వెళ్లి పరిచయం చేశారు.

అనసూయమ్మగారు విషయం విని చాలా సంతోషించారు.

"ముందు మీరు ఇల్లు చూడండి. మీకు సరిపోతుందో లేదో సౌకర్యంగా ఉంటుందో లేదో? రవణయ్యా వీరిని తీసుకొని వెళ్లి చూపించు" అన్నారు.

"చూశామండీ! సరిపోతుంది. సౌకర్యంగానే ఉంటుంది" అన్నారు.

"అమ్మా! మీ మోకాళ్ల నొప్పులు నన్నొకమారు పరీక్ష చెయ్యనివ్వండి" అంది డా.జానకి చనువుగా.

ఆవిడను పరీక్షించి బాధ వివరాలు అడిగి తెలుసుకుంది. సూదిమందు అంటే భయం అని వింది.

"చూడండీ నేను మీకు సూదిమందివ్వను. మీ ముణుకులకు మందు రాస్తాను. అంతే!" అని కారులో ఉన్న తన మెడికల్ కిట్ తెప్పించింది. ముణుకులకు స్పిరిట్ రాసి అక్కడే చేరిన ఫ్లూయిడ్‌ని మెల్లగా నొప్పి తెలియకుండా సిరంజ్‌తో తీసివేసింది.

ఆమె చేస్తున్న పని అనసూయమ్మగారికి కనిపించకుండా డా.శివరాం అడ్డుగా నిల్చుని ఆవిడను మాటల్లోకి దింపాడు.

డా.జానకి ఆవిడను మంచం దిగి నడవమని చెప్పింది.

అనసూయమ్మగారు భయపడుతూనే మంచం దిగి నాలుగు అడుగులు వేసి చూశారు తన నొప్పులన్నీ మంత్రం వేసినట్లు మాయమయ్యాయి అని గ్రహించి సంతోషించింది.

ఇంతలో ఒక అమ్మాయి చెంబుతో నీళ్లు, సోపు, టవల్ తెచ్చింది. డా.జానకి చేతులు కడుక్కుంది. వంటావిడ సుశీల అందరికీ కాఫీలు తెచ్చి ఇచ్చింది. డా.జానకి మాత్రలు కొన్ని ఇచ్చి అవి ఎలా ఎప్పుడు వేసుకోవాలో చెప్పింది.

సుశీలను, ఆమె కూతురు నీరజను వారికి పరిచయం చేసి వారి సేవలను కొనియాడేరు అనసూయమ్మగారు.


సిరిపురం అగ్రహారం జాతీయ రహదారిని అనుకొని పట్నానికి 40 మైళ్ల దూరంలో ఉంది.

పది గ్రామాలకు కూడలి. రామనాథంగారికి ఆ గ్రామంలో భూములు, తోటలూ ఉన్నాయి. మండువా లోగిలి ఇల్లుంది. ఇంటి చుట్టూ ఖాళీ స్థలం, దాని చుట్టూ ప్రహరీ గోడ ఉంది. ప్రహరీ గోడను ఆనుకొని ధాన్యం నిల్వ చేయడానికి నాలుగు దాబా గదులు, వాటి పక్కనే పెద్ద రేకుల షెడ్డు ఉన్నాయి. అందులో వ్యవసాయ పని ముట్లు ఉన్నాయి.

రామనాథంగారికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పెద్దవాడు గోపీ కృష్ణ, రెండోవాడు కమలాకరం. ఇద్దరూ ఇంజనీర్లు. పట్నంలో ఉద్యోగాలు చేస్తున్నారు. కూతురు సరోజ. ఆమె భర్త విజయవాడలో బ్యాంకు ఆఫీసరు. రామనాథం దంపతులు దాన ధర్మాలు చేయడంలో వెనుకాడరు. గ్రామ ప్రజలకు తన డబ్బు, పరపతితో ఎన్నో సౌకర్యాలు కలిగించారు రామనాథంగారు.

అయితే అటు కొడుకులకూ, ఇటు కూతురికీ వారి దానధర్మాలు నచ్చలేదు. ఆస్తి పంపకాలు చేయించి తమవంతు వాటా అమ్మివేసి వెళ్లిపోయారు. వీరి గురించి పట్టించుకోలేదు. పాతిక సంవత్సరాల బట్టి గ్రామం వేపు తిరిగి చూడలేదు. రామనాథం దంపతులు పూజారిగారి అమ్మాయిని, కూతుర్ని చేరదీసి ఇంట్లో ఆశ్రయమిచ్చారు.

సిరిపురం పక్క గ్రామం ధర్మవరం. ఆ గ్రామంలో శివరామశాస్త్రిగారు గొప్ప పండితులు. నాలుగు వేదాలు, సంస్కృతం చదువుకున్న వ్యక్తి. ఆయనకు తాత ముత్తాతలు సంపాదించిన పంట పొలాలు, పండ్లతోటలున్నాయి. వారి ఏకైక కుమార్తె శారద. ఆమె సిరిపురం హైస్కూల్లో టెన్త్ చదివింది. రామనాథంగారి అమ్మాయి సరోజ. పూజారిగారి అమ్మాయి సుశీల. శివరామశాస్త్రి




అమ్మాయి శారద ఒకే ఈడు వారు. కలిసి చదువుకున్నారు. మంచి స్నేహితులు. శారద అందచందాలు, వినయ విధేయతలను అనసూయమ్మగారు పలు మార్లు మెచ్చుకున్నారు.

రామనాథంగారి కొడుకులిద్దరూ ఇంజనీర్లుగా ఉద్యోగాల్లో చేరగానే వారిలో ఒకరికి శారదనిచ్చి వివాహం చేస్తే బాగుంటుందని ధర్మవరం గ్రామ పెద్దలు శివరామశాస్త్రిగారికి సలహా ఇచ్చారు. సిరిసంపదలలోనూ, గౌరవ మర్యాదల్లోనూ వారి కంటే మీరే ఎన్నో రెట్లు ఎక్కువ అని వారిని ప్రోత్సహించి రామనాథంగారింటికి తీసుకొని వెళ్లారు.

వారు వెళ్లే సమయంలో రామనాథంగారి కొడుకులిద్దరూ ఇంటి వద్దే ఉన్నారు. విషయం విన్న రామనాథంగారు, అనసూయమ్మగారు ఎంతో సంతోషించారు. వారు సమాధానం చెప్పేలోపలే.

"నాలుగు వేదం ముక్కలు నేర్చుకుని ఇంటింటికీ తిరిగి పూజలు చేయించే మీకు ఇంజనీరు అల్లుడు కావాలా? ఏ పూజారినో, పురోహితుడినో మీ హోదాకు తగిన వాడిని చూసుకుంటే సమఉజ్జీగా ఉంటుంది!" అన్నారు కొదులిద్దరూ వెటకారంగా.

రామనాథంగారు, అనసూయమ్మగారు కొడుకుల మాటలకు సిగ్గుపడ్డారు. శివరామశాస్త్రిగారు అవమాన భారంతో తలదించుకున్నారు. వారిని బలవంతంగా తీసుకొచ్చిన గ్రామ పెద్దలు ఉగ్రరూపులయ్యారు.

"మీ అంతస్తుకూ, గౌరవమర్యాదలకూ మా శాస్త్రిగారు తక్కువేం కారు! వారు రాష్ట్రపతి

చేత సత్కారం పొందిన మేధావులు..." అని ఇంకా ఏవో చెప్పబోయారు.


శాస్త్రిగారు వారిని వారించి-

"క్షమించాలి! పొరపాటు నాదే! అని అక్కడ నుండి బయటకు వచ్చారు. శాస్త్రిగారికి జరిగిన అవమానానికి తామే బాధ్యులమని గ్రామ పెద్దలు ఎంతో విచారం వెలిబుచ్చారు.

"వారితో సంబంధం ఇష్టం లేకుంటే ఆ విషయం వారికి సౌమ్యంగా చెప్పాలి గానీ ఇలా అవమానపర్చడం మంచి పద్ధతి కాదు" అని కొడుకులతో అన్నారు తల్లిదండ్రులు.

అయితే వారి మాటలను కొడుకులిద్దరూ లెక్కచేయలేదు. తల్లిదండ్రుల మాటలు వారే నాడూ పట్టించుకోలేదు.

డా.శివరాం ఎమ్.ఎస్. చేసి పై చదువులకు అమెరికా వెళ్లాడు. వైద్య విద్యలో మెళకువలు నేర్చుకొని అక్కడే కొన్నాళ్లు జాబ్ చేశాడు. అంతకుముందే అతని పెదతండ్రి కూతురు జానకి. ఆమె భర్త సీతారాం డాక్టర్స్‌గా జాబ్స్ చేస్తున్నారు. సీతారాం కారు ప్రమాదంలో మరణించడంతో అక్కను, ఆమె ఆరేళ్ల కొడుకునూ తీసుకొని డా.శివరాం స్వదేశానికి తిరిగివచ్చాడు. పట్నం కార్పొరేట్ హాస్పిటల్లో జాబ్స్ చేస్తున్నారు ఇద్దరూ. డా.శివరాం తండ్రి మాధవరావు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు.




డా.జానకి, ఆమె కొడుకు ఉదయ్, డా.శివరాం, వంటమనిషి సామాన్లతో వచ్చి రామనాథంగారింట్లో దిగారు.

అనసూయమ్మగారి జబ్బు బాగుచేసిన విషయం సిరిపురంలోనే గాక చుట్టుపక్కల గ్రామాల్లోనూ తెలిసింది. వైద్యం కోసం ప్రజలు డా.జానకి వద్దకు రాసాగారు. ఈ విషయం తెలుసుకున్న రామనాథంగారు వారి ఆవరణలోని ధాన్యం గదులు నాలుగూ ఖాళీ చేయించి "అమ్మా! మీ హాస్పిటల్ తయారయ్యే వరకూ మీరు వీటిని రోగులను పరీక్ష చేసి వారికి వైద్యం చేయడానికి ఉపయోగించుకోండి" అన్నారు.

వారి సలహా ఆమెకు నచ్చింది. ఒకదానిలో అవసరమైన మందుల కోసం మందుల షాపు ఏర్పాటు చేయించి వైద్యం ప్రారంభించింది. తీరిక సమయంలో డా.శివరాం కూడా వైద్య సేవలు అందిస్తున్నాడు. డిగ్రీ పూర్తి చేసిన నీరజను డా.జానకి తన పి.ఏ.గా నియమించుకుంది.

హాస్పిటల్ నిర్మాణానికి శ్రమదానం చేస్తామంటూ చుట్టుపక్కల గ్రామ ప్రజలు, సిరిపురం వాసులు వచ్చి రామనాథంగారిని కలిసేరు. వారు ఈ విషయం డా.శివరాంకి చెప్పారు. నిర్మాణం పనులన్నీ కాంట్రాక్టర్లకి అప్పగించాడు డా.శివరాం. అయితే వారు రోజువారీ పనులకు గ్రామంలో కూలీలనే నియమించాలి. అందుకు రామనాథంగారు ఓ సలహా ఇచ్చారు.

"శ్రమదానం చేస్తామని వచ్చిన వారి కూలి డబ్బులు బ్యాంకులో వేసి వాటి వడ్డీని పేదరోగుల వైద్యానికి వినియోగించమన్నారు"

ఆయన సలహా అందరికీ ఎంతో నచ్చింది.


హాస్పిటల్ నిర్మాణం పూర్తయ్యేసరికి అవసరమైన పరికరాలు సమకూర్చి సిబ్బందిని నియమించాడు డా.శివరాం. "అన్నపూర్ణ నర్సింగ్ హోమ్" అమ్మమ్మ పేరు పెట్టాడు.

ప్రారంభోత్సవానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని ఆహ్వానించాడు డా.శివరాం. మంత్రిగారు అన్నపూర్ణ నర్సింగ్‌హోమ్‌లో ఆరోగ్యశ్రీ పథకం అమలుపర్చడానికి తగిన వసతులు, సౌకర్యాలు ఉన్నందున వెంటనే ఆర్డరు వేశారు.



## అసలైన హీరోగారు!

**సల్మాన్ ఖాన్-ఐశ్వర్యల ప్రేమాయణం గురించి అప్పట్లో బాలీవుడ్డంతా కోడైకూసింది. ఇద్దరూ పెళ్లి చేసుకుంటారనుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా ఇద్దరి మధ్యా తేడాలొచ్చి విడిపోయారు. అభిషేక్ బచ్చన్‌తో ఐశ్వర్య పెళ్లికి కూడా సల్మాన్ హాజరు కాకపోవడం పెద్ద చర్చనీయాంశం అయింది. అయితే తాజాగా ఐశ్వర్య గురించి సల్మాన్ నోటివెంట మంచి మాటలు రావడం జనాల్ని ఆశ్చర్యపరిచింది. 'ఐశ్వర్యారాయ్-అభిషేక్‌ని పెళ్లి చేసుకోవడం నాకెంతో సంతోషంగా వుంది. వారి వైవాహిక జీవితం హాయిగా సాగాలని ఆశిస్తున్నాను' అంటూ ఇటీవల ఓ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలు కూల్‌గా జవాబిచ్చాడు సల్మాన్.**




ప్రారంభోత్సవ వేడుకల్ని పత్రికల వారు, టీవీల వారు గొప్పగా ప్రచారం చేశారు.

రామనాథంగారి కొడుకులిద్దరూ పత్రికల్లోనూ, టీవీలలో ప్రసారమైన వార్తలు చదివి, చూసి తమ తండ్రి డా.శివరాంకి అందించిన సహాయ సహకారాలను తెలుసుకున్నారు. డా.శివరాంకి ఇంకా పెళ్లి కాలేదని విన్నారు. వెంటనే వారికి చక్కటి ఆలోచన స్ఫురించింది. వారిరువురూ తమ తమ భార్యలను, ఏకైక కూతుళ్లను తీసుకొని సిరిపురం వచ్చారు.

కొడుకులిద్దరూ అకస్మాత్తుగా కుటుంబాలతో రావడంతో రామనాథం దంపతులు ఆశ్చర్యం, సంతోషం వెలిబుచ్చారు. తల్లిదండ్రులకూ నూతన వస్త్రాలు, కానుకలిచ్చి యోగక్షేమాలు విచారించారు. మాటల సందర్భంలో డా.శివరాం వివరాలు అడిగి తెలుసుకున్నారు.

"డా.శివరాంని పెళ్లిచూపులకు ఆహ్వానించి మీ మనవరాళ్లను చూపించి నచ్చిన అమ్మాయిని చేసుకోమందామనుకుంటున్నాం" అన్నారు.

"మంచి ఆలోచనే! డా.శివరాం తల్లిదండ్రులు నిన్ననే హైదరాబాద్ నుండి వచ్చారని విన్నాను. అందరం కలిసి వెళ్లి మాట్లాడుదాం! అన్నారు రామనాథంగారు.

"మీరెందుకు రావడం! మేమే వెళ్లి మాట్లాడి వస్తాం. మేము వస్తున్న విషయం మీరు ఫోనులో చెప్పండి చాలు!" అన్నారు.

రామనాథంగారికి కొడుకుల స్వభావం తెలుసు కనుక డా.జానకికి ఫోను చేసి చెప్పారు. ఆమె డా.శివరాం తల్లిదండ్రులతో సంప్రదించి సాయంత్రం 6 గంటలకు రమ్మనమని చెప్పింది.

గోపీకృష్ణ కమలాకరం వారి భార్యలు సాయంత్రం 6 గంటలకు డా.శివరాం బంగళాకు వెళ్లారు. వారు వెళ్లేసరికి ఇంటిముందున్న లాన్‌లో ఒక ముసలాయన కుర్చీలో కూర్చుని ఉన్నారు. అతని ముందు ఇంచుమించు అదే వయసున్న పది మంది వ్యక్తులు పచ్చికలో కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

వీరి రాకను గమనించిన నీరజ వారిని సాదరంగా ఆహ్వానించి లోనికి తీసుకొని వెళ్లి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టింది. వారు వచ్చిన విషయం డా.జానకితో చెప్పింది.

డా.జానకి తన పినతండ్రి మాధవరావుని వెంట తీసుకొని వచ్చింది. పరిచయాలు అయిన తరువాత గోపీకృష్ణ విషయం చెప్పాడు.

"చూడండీ! పెద్దవారు మా మామగారున్నారు. వారితో సంప్రదించండి అది సంప్రదాయం. అంతేకాదు వారు మా అబ్బాయికి తాతగారు మాత్రమే కాదు గైడు, ఫిలాసఫర్, గురువు, దైవం! వారి సలహా, కోరిక మేరకే వాడు ఈ మారుమూల గ్రామంలో ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో పూర్తిగా వారి డబ్బుతోనే ఈ నర్సింగ్‌హోమ్ నిర్మించి దీనికి వాడి అమ్మమ్మగారి పేరు పెట్టాడు అన్నపూర్ణ నర్సింగ్ హోమ్" అని. లాన్‌లో కూర్చున్న మామగారిని పిలుచుకొని వచ్చాడు మాధవరావు.

మాధవరావు వెంట లోనికి వచ్చిన అతని మామగారు శివరామశాస్త్రిగారిని అతని స్నేహితులు ధర్మవరం గ్రామ పెద్దల్ని చూసి గోపీకృష్ణ, కమలాకరం షాక్ అయ్యారు.

○

## రీమేక్స్ నచ్చవు

**ఏదయినా ఓ భాషలో వచ్చిన సినిమాని మరో భాషలో రీమేక్ చేయడం అనేది చాలా కష్టమైన పనే. అలాగే ఒరిజినల్ వెర్షన్‌లోని 'అసలైన థ్రిల్' రీమేక్‌లో కనిపించకపోవచ్చు. అందుకనే నేను వీలైనంత వరకూ రీమేక్స్‌కి ఇష్టపడను-అంటున్నాడు ఆమీర్ ఖాన్. ఎంతో ఇన్‌స్పయిరింగ్‌గా అనిపించినప్పుడు మాత్రమే ఆల్రెడీ ఒక భాషలో వచ్చిన సినిమా రీమేక్‌లో నేను నటించడానికి రెడీ అవుతాను అని చెబుతున్న ఆమీర్- తమిళ 'గజిని' హిందీ రీమేక్‌లో నటించినప్పుడు ఒరిజినల్ ఫ్లేవర్ ఏమాత్రం పోకుండా కొన్ని బలమైన మార్పులు చేసాం కనుకనే ఆ సినిమాని అంత రక్తికట్టించాం- అని చెబుతున్నాడు.**

